క్లుప్తంగా

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

కోట: మండలంలోని సూరిశెట్టిపాళెంలో శ్రీకామాక్షీదేవి సమేత లింగేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం టీటీడీ వేదపండితులు నారాయణ బట్టాచార్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి, విమాన శిఖరస్థాపన, దీపారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

6,316 మందికి రైతు భరోసా

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఐదో విడత మండలంలోని 6,316 మంది రైతులకు రూ.4.75 కోట్లు గురువారం జమవుతాయని బుధవారం స్థానిక ఏఓ డాక్టర్ ప్రవీణ తెలిపారు. పీఎం కిసాన్ రూ.2 వేలు, రైతు భరోసా రూ.5,500 మొత్తం రూ.7,500 ఒక్కో రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాపూరు: రాపూరు ఆర్టీసీ డిపోలో గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో అభివృద్ధిపై ప్రయాణికులు 9959225651 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలను అందించాలని ఆయన కోరారు.

నేడు రైతు భరోసా చెక్కుల పంపిణీ

తడ: జిల్లా స్థాయి రైతు భరోసా మొదటి విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం తడలో నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయశాఖ అధికారిణి జ్యోతిర్మయి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న ఓ ప్రైవేటు హోటల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమం అనంతరం ఇక్కడ చెక్కును అందజేస్తారని ఆమె తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

గూడూరు: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు గరుడ చిత్రపటానికి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి, ధ్వజారోహణం నిర్వహించారు.

అయ్యప్ప సేవా సమాజం కమిటీ ఎంపిక



అయ్యప్ప సేవా సమాజం కమిటీ సభ్యులు

కోట: శబరిమల అయ్యప్ప సేవా సమాజం(ఎస్ఏఎస్ఎస్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గ సమావేశం బుధవారం కోటలోని వినాయకమందిరంలో జరిగింది. ఈ సమావేశానికి పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. నూతన కమిటీని ప్రకటించారు. ఎస్ఏఎస్ఎస్ నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గణేష్‌రవి, ప్రధాన కార్యదర్శిగా వావిల నాగరాజు, కార్యదర్శిగా యాకసిరి రవిని నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ శబరిమల విశిష్ఠతను ప్రజలకు తెలియజేస్తామన్నారు. అయ్యప్ప భక్తి మార్గాన్ని, సేవాతత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకయ్య, శివారెడ్డి, మురుగయ్య, గోవిందయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఈ చెట్టును తొలగించరా?



వాకాడు: గూడూరు – దుగ్గరాజపట్నం ఆర్అండ్‌బీ రహదారిపై వాకాడు మండలం కల్లూరుకు వెళ్లే కూడలి వద్ద మంగళవారం వీచిన ఈదురు గాలులకు నేలకూలిన చెట్టు రెండు రోజులుగా రోడ్డుకు అడ్డంగా పడి ఉంది. దీంతో వాహనదారులు బుధవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారిపై పడిన చెట్టును ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు వాహనాలకు ప్రమాదాలు తృటిలో తప్పుతున్నాయి. రోడ్డుపై పడిన చెట్టును వెంటనే తొలగించాలని వాహనదారులు అధికారులను కోరుచున్నారు.

ఐఐహెచ్‌టీకి మహర్దశ

- చేనేత, జౌళీ శాఖ ద్వారా రూ.35 లక్షల మంజూరు
- నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25 లక్షల విరాళం
- శరవేగంగా జరుగుతున్న ఆధునికీకరణ పనులు
- మెరుగుపడుతున్న వసతులు



ఐఐహెచ్‌టీ అడ్మినిస్ట్రేషన్ భవనం

వెంకటగిరి: పట్టణంలోని ఐఐహెచ్‌టీకీ మహర్దశ రానుంది. 90వ దశకంలో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కృషితో ఏర్పాటైన ప్రతిష్టాత్మక సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ పూర్వవైభవం దిశగా అడుగులు పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆ కళాశాల పట్ల కొంత నిర్లక్ష్య ధోరణి, పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రధాన ప్రాక్టికల్స్ షెడ్‌లు పైకప్పులు దెబ్బతిన్నాయి. అడ్మినిస్ట్రేషన్ భవనం శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఆ సంస్థను పరిశీలించిన తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాల స్థితిగతులను అధ్యయనం చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో తనవంతుగా స్వంత నిధులను నేదురుమల్లి ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షలతో ప్రాక్టికల్ షెడ్‌ల ఆధునికీకరణ పనులు చేయిస్తున్నారు. అదేవిధంగా స్థానిక ఐఐహెచ్‌టీ స్థితిగతులను రాష్ట్ర చేనేత, జౌళీశాఖ కమిషనర్, ప్రిన్స్‌పల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి భవనాల ఆధునికీకరణకు ప్రభుత్వం నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాతల సహకారం కోరే విధానంలో భాగంగా ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నతాధికారులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చర్చించి వారి సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేయించడంతో ఆ నిధులతో బాలుర వసతి గృహంలోని వాష్‌రూమ్‌లను ఆధునికీకరణ పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టారు.

మెరుగుపడనున్న వసతులు..

ఐఐహెచ్‌టీ విద్యాసంస్థలో విద్యార్థులకు ప్రభుత్వ, దాతల సహకారంలో చేపడుతున్న పనులు పూర్తయితే వసతులు మెరుగుపడనున్నాయి. వెంకటగిరి ప్రాంతంలో ఉన్న చేనేత కుటుంబాల పిల్లలకు ఉపయుక్తంగా ఉంటుందన్న ఆలోచనలో అప్పట్లో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వెంకటగిరి పట్టణానికి చేరువలో 25 ఎకరాల సువిశాల స్థలంలో ఆ సంస్థలను ఏర్పాటు చేయించారు. దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని ఐఐహెచ్‌టీ తాజాగా అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల పట్టణంలోని చేనేత కుటుంబాలు, ఐఐహెచ్‌టీ విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటే హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమో కోర్సు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రభుత్వ సహకారంతో ఈ కళాశాలలో వసతులు మెరుగుపడి, విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని హ్యాండ్‌లూమ్ విభాగంలో బీటెక్ ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయస్థాయి సంస్థను సద్వినియోగం చేసుకోవాలి



వెంకటగిరిలో ఏర్పాటైన జాతీయస్థాయి విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం వెంకటగిరి ఐఐహెచ్‌టీ ఆధునికీకరణకు నిధులు రూ.35 లక్షలు, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వంత నిధులు రూ.25 లక్షలు, ఐసీఐసీఐ సంస్థ మరో రూ.15 లక్షల నిధులతో వసతులు మెరుగుపడనున్నాయి.

–వెంకటరామ్, ప్రిన్సిపల్, ఐఐహెచ్‌టీ, వెంకటగిరి

గడప గడపకూ భరోసా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తొలిసారిగా పట్టణంలోని 3వ వార్డు పరిధిలో జరిగిన కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. వార్డులో చేనేత కార్మికుడు చెంగ్రాయులు జరీతో నేసిన వెంకటేశ్వరస్వామి వస్త్రాన్ని రామ్‌కుమార్‌రెడ్డికి బహూకరించారు. తెలుగుగంగ కాలువలో పడి మృతిచెందిన నితీష్ కుటుంబసభ్యులను పరామర్శించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్.బాలయ్య, కౌన్సిలర్లు ప్రభావతి, ఎంఏ నారాయణ, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, న్యాయవాది కోటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, యస్థానీబాషా, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం

డక్కిలి: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను చేరవచేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. డక్కిలి సచివాలయం పరిధిలోని డక్కిలి మెయిన్, కమ్మపల్లి రోడ్డు సెంటర్, వెంపటవారిపల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. రేషన్‌కార్డు వారీగా చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. గడప గడపలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎంపీపీ గోను రాజశేఖర్, గ్రామ సర్పంచ్ వేమక్క, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ, నేతలు మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి, డి.శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పాదిలేటి దశరథరామిరెడ్డి, చెంచయ్య, రవినాయుడు, నావూరు కోటేశ్వరరరావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం..

డక్కిలి సచివాలయం పరిధిలోని దేవుని వెల్లంపల్లి పంచాయతీలోని కుప్పాయిపాళెం, దేవునివెల్లంపల్లి, వెంకటేశ్వరపురం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు.

విత్తనాల దుకాణాలు తనిఖీ



నాయుడుపేట: పట్టణంలో విత్తన దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తిరుపతి డీఎస్పీ మల్లేశ్వరరెడ్డితో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీ చేసింది. తనిఖీల్లో దుకాణ డీలర్లు విక్రయించే విత్తనాలను పరిశీలించారు. విత్తనాలు నాశిరకం కావడంతో అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో డీఈఈ నాగసురేష్, డీసీటీఓ చిన్నారెడ్డి, సీఐ మల్లిఖార్జున, ఎస్ఐ రామక్రిష్ణనాయక్, మండల వ్యవసాయశాఖాధికారి జోగి గణేష్ పాల్గొన్నారు.

కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు



సమీక్షలో కమిషనర్ శ్రీనివాసరావు, చైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కౌన్సిల్ సభ్యులు అధికారులకు సూచించారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ ఐ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలో రూపొందించిన 22 అంశాలు, టేబుల్ అజెండాలో రూపొందించిన పనులు, అభివృద్ధి పనులపై కౌన్సిలర్లతో చర్చించారు. కొన్ని అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అగ్రహారపేట వీధి, వీపీఆర్‌లో రోడ్డు వర్షం కాలంలో జలమయం అవుతోందని రోడ్డు ఎత్తుచేసి గ్రావెల్ రోడ్డు నిర్మాణ చేయాలని కోరుతూ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, నాగార్జున చైర్ పర్సన్‌కు వినతి పత్రాన్ని అందించారు. శిథిలావస్థలో ఉన్న లైబ్రరీని డిజిటల్ లైబ్రరీగా మార్చాలని కౌన్సిలర్ సాధుశాంతి వినతి పత్రాన్ని అందించారు. కౌన్సిల్ సభ్యులందరూ కలిసికట్టుగా ఉంటూ నాయుడుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని చైర్ పర్సన్ అన్నారు. కౌన్సిలర్లు దారా రవి, కావేరిపాకం అశోక్‌కుమార్, షేక్ సబ్బీర్, కోఆప్షన్ సభ్యులు భవాన్, మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రవి, సాయి పాల్గొన్నారు.

అధికారులతో ఆర్డీఓ సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: ప్రజల సమస్యల పరిష్కారానికి బుధవారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిందన్నారు. తద్వారా వచ్చిన ఫిర్యాదులను ఆర్డీఓ పరిశీలించి అర్జీదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు అధికారులు కృషిచేయాలన్నారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

నాయుడుపేట: ప్రతి గిరిజనపౌరులు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర అన్నారు. పట్టణ పరిధిలోని శ్రీనివాసపురం గిరిజన కాలనీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సివిల్ రైట్స్ డే సందర్భంగా తెలియజేశారు. గిరిజనులకు ప్రభుత్వం కల్పించిన హక్కుల బాధ్యతల గురించి వివరించారు. స్వేచ్ఛ, సమానత్వాలను అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎవరైనా వీటికి ఆటంకం కలిగిస్తే ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. రేషన్ సరుకులు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వివక్ష చూపడం వంటి అంశాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు

ఓజిలి: బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని రాచపాళెం స్మశానం వద్ద బుధవారం ఈఘటన చోటుచేసుకుంది. భువనగిరిపాళెం గ్రామానికి చెందిన చెంచుకృష్ణయ్య, మరో వ్యక్తి బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. రాచపాళెం సమీపంలోని స్మశానం వద్ద వెళుతుండగా బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న చెంచుకృష్ణయ్య, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి 108 సిబ్బంది ఈఎంటీ దేవరాజు, పైలట్ వెంకటేశ్వర్లు సంఘటన స్థలం చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి గూడూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమిళ రేషన్ బియ్యం పట్టివేత

తడ: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 59 బస్తాల (850 కిలోలు) తమిళ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. సీఎస్ డీటీ ఓబయ్య తెలిపిన సమాచారం మేరకు అక్కంపేట వద్ద ఓ ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్టు అందిన సమాచారంతో తిరుపతి విజిలెన్స్ ఎస్ఐ విజయ్‌కుమార్‌తో కలిసి దాడి చేయగా బియ్యం పట్టుబడినట్టు తెలిపారు. వేనాటి భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా బియ్యాన్ని కొండూరు సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు తరలించినట్టు డీటీ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జనవరి 24న పిగిలాం గ్రామానికి చెందిన శివకృష్ణపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరించి బైక్‌లో పరారైన ముగ్గురిలో మనోజ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులోని ఇద్దరిలో మరో వ్యక్తి చెన్నైలోని మీంజూరు ప్రాంతానికి చెందిన వసంత్‌ప్రయస్ స్థానిక పోలీసులు బుధవారం తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. మూడో వ్యక్తిని త్వరలోనే అరెస్టు చేస్తామని నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సేవావజ్ర, సేవారత్నలను సన్మానిస్తున్న నేదురుమల్లి

సైదాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాగణం ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మండలంలోని వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతుండడంతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది పురస్కారాలతో సత్కరిస్తోందని తెలిపారు. అనంతరం సేవావజ్రగా ఎంపికైన తొలుసూరి భాగ్యమ్మ, గుమ్మడి ప్రసన్న అనే ఇద్దరు వలంటీర్లను రూ.30వేలతో పాటు పురస్కారంతో సత్కరించారు. సేవారత్నలుగా ఎంపికైన వంగపతి రతకనమ్మ, అట్ల చెంచయ్య, బైనబోయిన ఉమామహేశ్వరి, పాలూరు రమాదేవి, చింతలపూడి ప్రసాద్‌తో పాటు సేవామిత్ర పురస్కారాలు అందుకున్న 143మంది వలంటీర్లను శాలువా కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్మన్ పొట్టేళ్ల శిరీషాయాదవ్, జేఎస్‌సీ కన్వీనర్, మన్నారపు రవికుమార్‌యాదవ్, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దాసరిరాజు శంకర్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, వేములచేడు సర్పంచ్ చెమిర్తి జనార్దన్‌రాజు, వైస్ ఎంపీపీలు భాస్కర్, ఈశ్వరమ్మ, నేతలు ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రామచంద్రారాజు పాల్గొన్నారు.

స్ఫూర్తిమూర్తుల బాటలో జగన్

ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషిచేస్తున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురంలోని ఆస్పత్రి కూడలిలో అంబేడ్కర్ దళిత అభివృద్ధి సేవాసంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల నూతన విగ్రహాలను నేదురుమల్లి బుధవారం ఆవిష్కరించారు.

సైదాపురానికి వరాల జల్లు...

సమావేశంలో నేదురుమల్లి సైదాపురానికి వరాల జల్లు కురిపించారు. రూ.6కోట్లతో అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులను త్వరలో చేపడతామన్నారు. సైదాపురం–పొదలకూరు రహదారి పనులను అతి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అంబేడ్కర్ భవనంతో పాటు గురుకుల పాఠశాలను కూడా మంజూరు చేస్తామన్నారు. అలాగే సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. నేతలు సర్పంచ్ శారద, ఎంపీటీసీ వెంకటరమణయ్య, మల్లారపు పెంచలయ్య, రమణయ్య, మస్తానయ్య, శేషు ప్రభాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



శేషవాహనంపై స్వామి అమ్మవార్లు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ధ్వజారోహణ పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు బుధవారం ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఆలయం వద్ద సుప్రభాత సేవ, ఆరాధన, సహస్ర నామార్చన, ధ్వజస్తంభానికి స్నపన తిరుమంజన పూజలను టీటీడీ వేద పండితులచే నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం జరిపి కొడి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లను పూలతో ప్రత్యేక అలంకరణ చేసి శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. టీటీడీ డిప్యూటీ ఈఓ శాంతి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు సుధీర్, హరిరెడ్డి, అర్చకులు కిషన్‌స్వామి, టీటీడీ వేదపండితులు శేషాద్రి స్వామి, గోపి స్వామి పాల్గొన్నారు.

నేడు హనుమంతసేవ..

గురువారం ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంతసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆలయ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

వ్యవసాయ కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు



కాలువ ఆక్రమణపై న్యాయం చేయాలంటున్న రైతులు

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు చెరువుకు సాగునీరు సరఫరా చేసే వ్యవసాయ కాలువ పూడ్చివేతపై బుధవారం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రైతుల సమాచారం మేరకు జీలపాటూరు చెరువుకు సాగునీరు సరఫరా నిమిత్తం మార్గమధ్యలో పెళ్లకూరు వద్ద కొత్తూరు గ్రామానికి చెందిన అక్కుపల్లి కృష్ణయ్య వద్ద 1999లో కొంత భూమిని రైతులంతా కలిసి ఉమ్మడిగా కొనుగోలు చేసుకున్నారు. ఈక్రమంలో కాలువకు కావాల్సిన మార్గంలో ఆరు మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు జీలపాటూరు చెరువులోకి సాగునీరు సరఫరా అయ్యేలా వ్యవసాయ కాలువను కొనసాగించుకున్నారు. అయితే శ్రీకాళహస్తికి చెందిన ఓవ్యక్తి కాలువకు సమీపంలో ఉన్న భూమిని కొనుగోలు చేసి యంత్రాలతో కాలువను కూడా పూడ్చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈక్రమంలో రెవెన్యూ కార్యాలయానికి, పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న రైతులంతా డీటీ శ్రీనివాసులు, ఏఎస్ఐ సుబ్రమణ్యంలకు వినతిపత్రం అందించారు. అనంతరం వ్యవసాయ కాలువ వద్దకు చేరుకుని కాలువ ఆక్రమణలను తొలగించాలంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ కందమూడి శివకుమార్, కేసు బాలయ్య, ఆరూరు ప్రకాష్, యుగంధర్, కృష్ణమూర్తి, దశయ్య, రమణయ్య, బాలాజి, మునిరత్నం, జయరామయ్య పాల్గొన్నారు.

కండలేరులో 29.893 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 29.893 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 200, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 80, లోలెవల్ స్లూయిజ్‌కు180, హైలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పొగాకు ఉత్పత్తులతో పలు అనర్థాలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

దొరవారిసత్రం: పొగాకు ఉత్పత్తులతో పలు అనర్థాలు ఎదుర్కోక తప్పదని డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య అన్నారు. బుధవారం జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది రహదారిపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. డీవీ సత్రంలో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ నిర్వహించారు. పొగాకుతో కేన్సర్ వంటి రోగాలు వస్తాయని వైద్యాధికారులు తెలియజేశారు. వైద్యసిబ్బంది సంపూర్ణమ్మ, పద్మావతి పాల్గొన్నారు.